APTEL/2015/65279

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

సంపుటి :9 సంచిక : 206 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 01-01-2023 ఆదివారం పేజీలు :4 వెల : రూ.3/-







# అధినేతను తిట్టినా... స్పందన శూన్యం...

## -అధినేత చెప్పినా...వారసుడుతోనే కార్యక్రమాలు -అధినేత మాటే శిరోధార్యం...

## -2022లో మచిలీపట్నం నియోజకవర్గంలో పార్టీలపై 'విన్యూస్' విశ్లేషణ




**(విన్యూస్-మచిలీపట్నం):** జిల్లా కేంద్రం మచిలీపట్నం రాజకీయాలకు పుట్టినిల్లు. అటువంటి మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో వైకాపా, తెదేపా, జనసేన పార్టీల పరిస్థితి గడచిన 2022లో ఏ రీతిలో ఉందో ఒకసారి అవలోకనం చేసుకుందాం రండి. 2022లో జరిగిన పరిణామాలు చూస్తే ఒకింత విస్తుబోయేవే అంటే అతిశయోక్తి కాదు. జనసేనలో అధినేతనే తిట్టినా పట్టించుకునే నాయకులే లేరు. ఇక వైకాపా అధినేత చెప్పినా వారసుడితోనే కార్యక్రమాలు. అదేవిధంగా తెదేపా అధినేత చెప్పాడని రాష్ట్రం అంతా చుట్టేస్తున్న కొల్లు. ఆయా పార్టీల తీరు ఇలా ఉంది.

**అధినేతను తిట్టినా...స్పందన శూన్యం...**

**-జనసేనలో అంతేనా...!**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్. ఆయన పార్టీ తరపున గత 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వ్యక్తి బండి రామకృష్ణ. ఓడిపోయినా ఆయన నేటికీ అదేపార్టీలో ఉన్నారు. పార్టీలో ఉన్నారంటే ఉన్నారు అంతే అని చాలా మంది పెదవి విరుస్తుంటారు. ఎందుకంటే ఆయన పార్టీ కార్యక్రమాలు కన్నా సేవా కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. పార్టీ అభివృద్ధి కన్నా తన ఇమేజీ కోసమే పాకులాడుతుంటారనే వాదనలు ఉన్నాయి. ఈ క్రమంలో పార్టీ అధినేత ఇమేజ్‌కు డ్యామేజీ జరిగినా డోంట్ కేర్. ఒక పక్క వైకాపా పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే నిత్యం పవన్ కళ్యాణ్‌పై నిప్పులు కురిపిస్తున్నా స్పందన శూన్యం. పార్టీ పరంగాను, వ్యక్తిగతంగాను పవన్ కళ్యాణ్ ఇమేజ్ డ్యామేజ్ చేసేలా ప్రెస్‌మీట్లు పెట్టినా విననట్లే ఉంటారనే అభిప్రాయం జనసేన శ్రేణుల్లో ఉంది. స్థానిక ఎమ్మెల్యేతో ఎందుకు వచ్చిన విరోధం అనే ధోరణి ఉండటం వలనే జనసేన అభ్యర్థి బండి రామకృష్ణ ఉన్నట్లుగా జనసేన శ్రేణులు చెప్పుకుంటున్నారు. ఇలా గైతే కష్టమని రానున్న 2024 ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిని ఢీకొట్టాలంటే బలమైన అభ్యర్థి కావాల్సిందేనని జనసేన క్యాడర్ కోరుకుంటోంది. పేర్ని నానిని ఢీకొట్టే సత్తా గల నాయకుడు రావాలని వారు కోరుకుంటున్నారు. ఇక 2023లో అన్నా బండి రామకృష్ణ తీరు మారుతుందా లేక మరో కొత్త నాయకుడు జనసేనకు వస్తారా లేక తెదేపాతో పొత్తుతో సీటు వదులు కుంటారో చూడాల్సి ఉంది.

**అధినేత చెప్పినా...వారసుడుతోనే కార్యక్రమాలు...!**

ఇక అధికార వైకాపా పరిస్థితే వేరు. సాక్షాత్తు అధినేత వైఎస్ జగన్ చెప్పినా వారసుడ్ని నియోజకవర్గంలో తిప్పేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలతో పాటు ఏకంగా అధికారిక కార్యక్రమాలకు సైతం వారసుడ్నే వాడేస్తున్నారు. ఈ దఫా ఎమ్మెల్యే పేర్నినాని నే పోటీలో ఉండాలనే భావనలో వారసులకు నో ఛాన్స్ అని సాక్షాత్తు సిఎం జగన్ చెప్పినట్లు వార్తలు వైకాపా వర్గాల్లో జోరుగా చక్కర్లు కొట్టింది. అయినా పేర్నినాని తన తనయుడ్ని నియోజకవర్గ ప్రజలకు పరిచయం చేసే రీతిలో తిప్పుతున్నారు. దీంతో వైకాపా అధినేత చెప్పినా వారసుడితో గడప గడపకు వైకాపా ప్రభుత్వం కార్యక్రమం సైతం నాని వారసుడే నిర్వహించేస్తున్నాడు. ఈ క్రమంలో వైకాపా అధినేత మూడు నెలలకు ఒక సారి చేస్తోన్న గడపగడపకు వైకాపా ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు మార్కులు వేసే విశ్లేషణలో మచిలీపట్నంకు స్థానం దక్కడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక 2023లో వైకాపాలో ఏ పరిణామాలు నెలకొంటాయో వేచి చూడాల్సి ఉంది.

**రాష్ట్రం అంతా చుట్టేస్తున్న తెదేపా నేత**


అధినేత చంద్రబాబు చెప్పాడని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు మచిలీపట్నం కొల్లు రవీంద్ర రాష్ట్రం మొత్తం చుట్టేస్తున్నారు. బిసి నేతగా ఆయన రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అంత వరకు బాగానే ఉంది. కాని స్థానికంగా నియోజకర్గంలో పరిస్థితులు పట్టించుకోవడం లేదనే భావన క్యాడర్‌లో ఉంది. రాష్ట్ర బిసి కమిటీలు వేసినా..రెండేళ్లు గడిచినా నగర కమిటీ, మండల కమిటీ నియామకాలు చేయలేకపోవడం దానికి ఉదాహరణగా పార్టీ నాయకులు చెబుతున్నారు. నియోజకవర్గానికి కార్యక్రమాలకు వచ్చి




హాజరయి వెళ్లిపోతుండటంతోనే పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసే పనులు గాని, కమిటిల ఏర్పాటు గాని పూర్తి చేయలేకపోతున్నారని పార్టీ క్యాడర్ భావిస్తోంది. చంద్రబాబు యువకుడికి పదవి ఇచ్చినందుకు ఆనందించాలా లేక నియోజకవర్గంలో పార్టీ సంస్థాగతంగా బలహీనపడుతుందని ఆందోళన చెందాలో తెలియక క్యాడర్ సతమతమవుతోంది. పైకి బాగానే ఉన్నా పార్టీ పరిస్థితి సంస్థాగతంగా బలహీనంగా మారుతోందని తెదేపా సీనియర్ క్యాడర్ భావిస్తోంది. 2023లో అన్నా నాయకుడు నియోజకవర్గంలో పార్టీ సంస్థాగతంగా బలోపేతం అయ్యేలా చర్యలు చేపట్టాలని క్యాడర్ భావిస్తోంది. అది సంగతి. మచిలీపట్నంలో 2022లో పార్టీల పరిస్థితి.

# భారత్‌లో తొలి 'సూపర్ వేరియంట్' కేసు నమోదు

## - ప్రమాదకరమేనంటున్న నిపుణులు



**ఢిల్లీ :** భారత్‌లో ఒమిక్రాన్ ఉపరకం ఎక్స్‌బీబీ. 1.5 తొలి కేసు వెలుగుచూసింది. గుజరాత్‌లో ఇది బయటపడినట్లు ఇన్సాకాగ్ వివరాల్లో వెల్లడైంది. ప్రస్తుతం అమెరికా లో కరోనా కేసులహోపెరుగుదలకు ఈ సబ్ వేరియంటే కారణమవుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎక్స్‌బీబీ. 1.5 వేరియంట్ వల్ల గత వారం వ్యవధిలోనేహోఅమెరికాలో కేసులు 21.7 శాతం నుంచి 41 శాతం పెరిగాయని యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది. దీని కారణంగా న్యూయార్క్‌లో ఆస్పత్రుల్లో చేరికలూ పెరుగుతున్నాయి.

ఒమిక్రాన్‌కు చెందిన రెండు వేర్వేరు బీఏ.2 సబ్-వేరియంట్‌ల సమ్మేళనమైన 'ఎక్స్‌బీబీ' రూపాంతరమే 'ఎక్స్‌బీబీ. 1. 5'. దీన్ని 'సూపర్ వేరియంట్'గానూ పేర్కొంటున్నారు. అదనపు మ్యుటేషన్ కారణంగా మానవ శరీరంలోని కణాలను అంటిపెట్టుకునే లక్షణం దీనికి అధికంగా ఉందని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయ వైరాలజిస్ట్ ఆండ్రూ పెకోస్జ్ తెలిపారు. బీక్యూ, ఎక్స్‌బీబీ సబ్ వేరియంట్‌లతో పోల్చితే రోగనిరోధకతను ఏమార్చే సామర్థ్యం ఎక్కువ ఉండటంతోపాటు వ్యాప్తి అవకాశాలూ ఎక్కువేనని అంటువ్యాధుల నిపుణుడు ఎరిక్ ఫీగల్-డింగ్ ట్వీట్ చేశారు. ఎక్స్‌బీబీ. 1. 5కి సంబంధించి ఆయన పేర్కొన్న అంశాల్లో కొన్ని.. రోగనిరోధక శక్తిని ఏమార్చే బలమైన వేరియంట్‌లలో ఇదీ ఒకటి.

మానవ శరీరంలో ప్రవేశించడం, కణాలపై దాడి చేయడంలో దూకుడు కనబర్చుతుంది.


పాత ఎక్స్‌బీబీ లేదా బీక్యూ రకాల కంటే చాలా వేగంగా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఉపరకం ప్రబలంగా ఉన్న చోట్ల ఆసుపత్రుల్లో చేరికలు పెరుగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. గుజరాత్‌లో మొదటి ఎక్స్‌బీబీ. 1. 5 కేసు గుర్తించడంతో.. పొరుగున ఉన్న మహారాష్ట్ర అప్రమత్తమైంది. 'రాష్ట్రంలో ప్రస్తుతం 275కుపైగా ఎక్స్‌బీబీ కేసులు ఉన్నాయి. కానీ, ఎక్స్‌బీబీ. 1. 5 గురించి చాలా తక్కువగా తెలుసు. దీంతో.. ఈ ఉపరకంపై దృష్టి సారించాం. ఇది ఎక్స్‌బీబీ రూపాంతరమే కాబట్టి.. కొన్ని మార్పులు ఉండొచ్చని సమాచారం. ఏదేమైనా.. వైరస్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ 100 శాతం జీనోమ్ సీక్వెన్సింగ్ నిర్వహిస్తున్నాం' అని రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.















# న్యూఇయర్ 'ఆయుధ పూజ'

అర్జునా... జాగ్రత్త! ఏకలవ్యుల బొటనవేళ్లు ఇక మీదట తెగిపోవడం లేదు. వారి వింటి నారి ఝుంకారాన్ని విని ఝడుసుకోకు. సూతపుత్ర కర్ణుడి దివ్యాస్త్రాలు పనిచేయకుండా ఏ పరశు రాముడూ ఇప్పుడు శపించలేడు. నీ అరివీరుని ధనుష్టంకారానికి అదిరిపడకు.

ఆయుధమే కదా విజేత ఎవరో విజితుడెవరో నిర్ణయించేది! ఆయుధ ప్రయోగ మంత్రమే కదా విజేతల విజయ రహస్యం! అది దేశాల మధ్య యుద్ధమైనా, సమాజంలోని భిన్నవర్గాల పోరాటమైనా... ఆయుధమే గెలుపు తులాభారం.

కేవలం నాలుగైదు దేశాలు ప్రపంచ రాజ్యాలన్నిటిపై పెత్తనం చేసి వలసపాలన స్థాపించగలిగింది ఆయుధ బలంతోనే. నూటికి ఎనభై మంది పేద ప్రజల జీవితాలతో పిడికెడుమంది శ్రీమంతులు యథేచ్ఛగా ఆటలాడుతున్నదీ సాయుధ గర్వంతోనే!

మారుతున్న కాలంతోపాటు ఆయుధం కూడా తన రూపును మార్చుకుంటున్నది. ఒకనాడది తుపాకీ కావచ్చు. తుపాకుల్లో శ్రేష్ఠమైనదీ కావచ్చు. క్రమంగా విజ్ఞానమే ఆయు ధంగా మారుతున్నది. ఆయుధం పుస్తక రూపాన్ని కూడా సంతరించుకున్నది.

ఆ పుస్తకం కాలానికి తగినట్టు కంప్యూటర్ అవతారమెత్తుతున్నది. సాంకేతిక నైపుణ్యాన్ని ఆవాహన చేసుకుంటున్నది. ఆ చదువే ఇప్పుడు పరమాయుధం. చదువే ఇప్పుడు పాశుపతాస్త్రం. చదువే ఇప్పుడు నారాయణాస్త్రం. చదువే ఇప్పుడు బ్రహ్మాస్త్రం!

కాలంతోపాటు నడిపించే ఇంగ్లిషు మీడియం చదువు శ్రీమంతుల కుటుంబాలకే పరిమితం కావడం అన్యాయం కాదా? కాలాన్ని శాసించే కంప్యూటర్ చదువు వారి గుప్పిట్లోనే బందీ కావడం సామాజిక దోపిడీ కాదా? నిరుపేదల బిడ్డలు వసతుల్లేని బడుల్లో అరకొర అక్షర జ్ఞానంతో ఇంకెన్నాళ్లు వెనక బాటుతనాన్ని దిద్దుకుంటూనే ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడీ దుర్నీతికి సంకెళ్లు పడుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం విప్లవదీక్షతో ప్రభుత్వ బడుల స్వరూప స్వభావాలను మార్చివేసింది. కార్పొ రేట్ స్కూళ్లకు ధీటుగా పేదబిడ్డల చేతికి ట్యాబ్‌లను అంద జేస్తున్నది. కేవలం ట్యాబ్‌లే కాదు సుమా! అత్యంత ఆధునికంగా ఆడియో విజువల్ బోధనా పద్ధతులు మేళవించిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లవి.

ఆ పెట్టెలో శస్త్ర సంధాన మంత్రోపదేశం ఉన్నది. అర్జునుడి చెవిలో ద్రోణాచార్యుడు చెప్పిన విలువిద్యా రహస్యం ఇక ఏకలవ్యులకు కూడా వినబడబోతున్నది. డిజిటల్ డివైడ్ అంతం కానున్నది. అక్షర పెత్తందారీతనానికి తెరపడబోతున్నది. సాంకేతిక దోపిడీకి చరమగీతం పాడే సమయం ఆసన్నమవుతున్నది.

అదిగో ఈ ఫోటోలోని బాలిక పరవశాన్ని చూడండి. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ను అపురూపమైన ఆయుధంగా భావించి ముద్దాడుతున్న ఆ బాలిక స్పందన చూడండి. పద్మవ్యూహ చక్రబంధంలో అభిమన్యుని ఇరికించిన కురువీరులు అధర్మ యుద్ధంతో అతడిని నిరాయుధునిగా మార్చినప్పుడు... ఏ అదృశ్యశక్తో అతడి చేతికి ధనుర్బాణాలను అందజేస్తే స్పందన ఎలా ఉండేదో?... ఈ ఏకలవ్యుల స్పందన కూడా అలాగే ఉన్నది.

చేతికందిన విల్లంబుల్ని ఎక్కుపెట్టడానికి వారు సిద్ధపడు తున్నారు. చేప యంత్రాలను కొట్టడానికో, చెట్టుమీదున్న పిట్ట కన్నును పొడవడానికో వారు పరిమితం కాబోరు. ఈ లోకపు వెలుగుల్ని దిగంతాల దాకా మండించగల విలుకాళ్లవుతారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు వర్గపోరాటం (క్లాస్ వార్) నడుస్తున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. నిజమే ఇప్పుడిక్కడ స్పష్టమైన వర్గ విభజన ఏర్పడుతున్నది. పేదలంతా ఒకవైపు సమీకృతమవుతున్నారు. సంపన్నవర్గ ప్రయోజనాన్ని కాంక్షించే వారంతా ఒకవైపునకు కదులుతున్నారు.

పేదవర్గాల ప్రజలందరికీ సమానావకాశాలు లభిస్తే, అవకాశాలను అందిపుచ్చుకోగల నైపుణ్యాన్ని ఆ వర్గాలు సంతరించుకుంటే సంపన్నుల పెత్తందారీతనానికి సవాల్ ఎదు రౌతుంది. సహజ వనరులపై, రాజకీయ, ఆర్థిక రంగాలపై వారికి ఉన్న పట్టు సడలుతుంది. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు హామీ ఇచ్చింది కేవలం రాజకీయ ప్రజాస్వామ్యం మాత్రమే కాదు. ఆర్థిక ప్రజాస్వామ్యం, సామాజిక ప్రజాస్వామ్యం కూడా.

ఈ ప్రజాస్వామ్యాలు విస్తృతమవుతున్న కొద్దీ పేదవర్గాలు అదే నిష్పత్తిలో సాధికారతను సాధిస్తాయి. ఇది మౌలిక సూత్రం. అందువల్లనే ప్రజాస్వామ్యం విస్తృతమవడానికి పెత్తందారీ వ్యవస్థ ఇచ్చగించదనే సంగతి మనందరికీ తెలిసిన సత్యమే. రాజ్యాంగం కల్పించిన అవకాశాలను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న కారణంగానే ఇప్పుడు రాష్ట్రంలో వర్గపోరాటం అనివార్యమయ్యే పరిస్థితి నెలకొన్నది.

పెత్తందారీ వ్యవస్థ వేయిచేతుల కార్తవీర్యార్జునుడి లాంటిది. ఏకకాలంలో ఐదువందల బాణాలను వివిధ లక్ష్యాల పైకి ప్రయోగించగలదు. మనం ఏం తింటే రైటు? ఎప్పుడు పడుకుంటే రైటు? సంప్రదాయాలేమిటి? ఆచారాలేమిటి? వగైరా వ్యక్తిగత విషయాలను కూడా కట్టుబాట్ల పేరుతో పెత్తం దారీ వ్యవస్థ నిర్దేశిస్తుంది. ఏది న్యాయం? ఏది ధర్మం? ఏది అభివృద్ధి? ఏది అరాచకం? అనే విషయాలను ఈ వ్యవస్థ తన వేయిబాహువుల ద్వారా వెల్లడి చేస్తుంది. దీన్నే మనం ఆధిపత్య భావజాలం అంటున్నాము.

దాన్ని మనం నమ్మాలి. సేవ్ డెమోక్రసీ పేరుతో హఠాత్తుగా విజయవాడలో ఒక మీటింగ్ జరుగుతుంది. పెత్తందారీ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేస్తుంది. దానికి జనసేనతోపాటు కమ్యూనిస్టు పార్టీలు రెండూ హాజరవుతాయి. పీపుల్స్ డెమోక్రసీ (జనతా ప్రజాస్వామ్యం) పేరుతో జాతీయ అధికార పత్రికను నడుపుతున్న రాజకీయ పార్టీ ఈ హెజిమోనిక్ డెమోక్రసీ (పెత్తందారీ ప్రజాస్వామ్యం) సమావేశానికి హాజరు కావడం విచిత్రం. అదే పెత్తందారీ కార్తవీర్యార్జునుడి ప్రత్యేకత.

అదే విజయవాడలో అసందర్భంగా ప్రపంచ తెలుగు రచయితల సభ జరుగుతుంది. ఆ సభలోని వక్తలంతా తెలుగు భాష ప్రాచుర్యంపైన కాకుండా ఇంగ్లిష్ మీడియం బోధనపైన దాడిని ఎక్కుపెడతారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశపెట్టిన తర్వాత తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియా వ్యతిరేకించాయి.

# గంగినేని హై స్కూల్లో "జగనన్న స్ఫూర్తి" స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ జిల్లా పరిషత్ చైర్మెన్ ఉప్పాల హారిక కి ప్రత్యేక ధన్యవాదాలు



**(వి న్యూస్ మైలవరం):** ఎన్టీఆర్ జిల్లా, మైలవరం నియోజకవర్గం, జి.కొండూరు మండలం, గంగినేని జిల్లా పరిషత్ హై స్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు "జగనన్న స్ఫూర్తి" స్టడీ మెటీరియల్ పంపిణి కార్యక్రమంలో పాల్గొని ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్కూల్ యాజమాన్యం తో కలిసి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణి చెయ్యడం జరిగింది. ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకొని, గొప్ప ఆలోచనలతో ముందుకు వెళ్లాలని,10వ తరగతి విద్యార్థుల కోసం మన ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక , వారి సొంత నిధులతో,రిటైర్డ్, సీనియర్ ఉపాధ్యయులతో మాట్లాడి వారి ద్వారా ఈ స్టడీ మెటీరియల్ ను తీర్చిదిద్దారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి , పిల్లల చదువులు కోసం సమూల మార్పులు తీసుకొచ్చారు అని, అమ్మఒడి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించి, విద్యార్థులు మంచి ఆహారాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో గోరుముద్ద ప్రవేశ పెట్టారని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు అందరూ ఈ స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మందా జక్రదర రావు , గంగినేని గ్రామ సర్పంచ్ పిల్లి రామారావు , ఎంపీటీసీ సభ్యులు పిల్లి ప్రసాద్ , స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ , ఉపాధ్యాయులు ప్రసాద్ , నాగరాజు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

# 8వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ట్యాబు పంపిణీ చేసిన జెడ్పిటిసి, ఎంపీపీ







**(వి న్యూస్ పిడుగురాళ్ల):** పిడుగురాళ్ల పట్టణంలోని గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు జగనన్న పుట్టినరోజు కానుకగా ప్రవేశపెట్టిన బైజుస్ ట్యాబులను 8వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు శనివారం రోజున పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల జడ్పిటిసి సభ్యులు జంగా వెంకట కోటయ్య, మండల ప్రెసిడెంట్ ముడేల వెంకటేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి వెంకటేశ్వర్ రెడ్డి, స్కూల్ ఎ ా ం . ి శ ా ల ప్రధానోపాధ్యాయులు ఎం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముడేల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా ఇవ్వబడిన ట్యాబులను వినియోగించుకొని పిల్లలు తమ చదువుల్లో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య కొరకు చేస్తున్న బృహత్తరమైన కార్యక్రమానికి మీ వంతుగా కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని సూచించారు.

# యువగళం విజయవంతం చేద్దాం



**(వి న్యూస్ రంగన్న గూడెం):** హా"యువగళం" పేరుతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రను విజయవంతం చేస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు తెలిపారు.

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాలు మేరకు కృష్ణా జిల్లా బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామంలో శనివారం ఉదయం గ్రామ తెలుగుదేశం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యువగళం, గోడ పత్రికను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి ప్రభుత్వ హయాంలో కోవిడ్ సమయంలో పదవ తరగతి పరీక్షలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించినప్పుడు నారా లోకేష్ రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఉన్న పదవ తరగతి విద్యార్థిని,విద్యార్థులను చైతన్య పరచి పరీక్షలను రద్దు చేయించి పిల్లలు కోవిడ్ బారిన పడకుండా కాపాడిన ఘనత లోకేష్ కే దక్కుతుందన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్,ఐటీ శాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నో అవార్డులు రావడానికి కృషిచేశారని, రాష్ట్రంలోని మారుమూల పంచాయతీలతో సహా ఎల్ఈడి విద్యుత్ దీపాలు వెలిగించారని, అట్లాగే తిరుపతి, విశాఖ, మంగళగిరి, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఎంతోమంది యువతకు ఐటీ రంగంలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. యువగళం జనవరి 27వ తేదీన కుప్పంలో ప్రారంభమై 400 రోజులపాటు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహిస్తారని, ఈ పాదయాత్రలో తెలుగు యువత అధిక సంఖ్యలో పాల్గొని తాము ఎదుర్కొంటున్న సమస్యలను నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకువచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హాఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు, మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కసుకుర్తి వేణుబాబు, ఎంపీసీఎస్ అధ్యక్షులు మొవ్వ శ్రీనివాసరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కసుకుర్తి అర్జునరావు, ఆళ్ళ శివ నాగేశ్వరరావు, కనకవల్లి శేషగిరిరావు, కొలుసు గంగాజలం, నత్తా అబ్రహం, కాట్రు పాపారావు, కసుకుర్తి కృష్ణారావు,గ్రామ తెలుగు యువత నాయకులు ఆలపాటి రవి కిషోర్, కనకవల్లి యాకోబు, పల్లగాని వీరాంజనేయులు, మేకల సురేష్ ,కొలుసు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పెన్షన్లు తొలగించడం అన్యాయం!

## - డీసీసీ మైనార్టీ ప్రెసిడెంట్ ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ డిమాండ్



**(వి న్యూస్,రాయచోటి):** రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క జనవరి 2023 నుండి 250 రూపాయలు పెన్షన్ పెంచుతున్నట్టు నిర్ణయం తీసుకొని, మరోపక్క అర్హులైన వారందరిని పెన్షన్ తొలగిస్తామని చెప్పి ఏదో ఒక సాకు చూపించి నోటీసులు జారీ చేయడం ఇది దుర్మార్గపు చర్య అని అన్నమయ్య డిసిసి మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. పెన్షన్ల విషయంలో రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థ పక్షపాతంగా వ్యవహరిస్తూ అవ్వతాతలకు, వికలాంగులకు, అక్కాచెల్లెళ్లకు, వితంతువులకు , పెన్షన్లు తొలగిస్తామని చెప్పి నోటీసులు ఇవ్వడం పనికిమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. శనివారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి చాలా ఘోరంగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఈ దుర్మార్గానికి పాల్పడిందని స్పష్టంగా అర్థమవుతుందని ఆయన చెప్పారు. ఉదాహరణకు 100 మందికి 250 రూపాయలు చొప్పున పెన్షన్లు పెంచితే 25 వేలు ఆదనంగా చెల్లించాల్సి వస్తుంది, దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ 100 మందిలో పదిమందిని పెన్షన్ ఇవ్వకుండా చేస్తే 25000 లోటును భర్తీ చేయవచ్చు అని ఆ దిశ లో నిర్ణయాలు తీసుకొని లబ్ధి పొందుతున్న పెన్షనర్లకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పక్షాన నిలబడి అర్హులు ఎవరు అనర్హులు ఎవరు అని గుర్తించి, నిష్పక్షపాతంగా వ్యవహరించి నిజమైన అర్హులందరికి పెన్షన్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

**(వి న్యూస్ మచిలీపట్నం):** 2023 నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభతరుణంలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్. అపరాజిత సింగ్ లు జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతి నిధులకు, జిల్లా అధికారులకు పాత్రికే యులకు శనివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో కొత్త ఆశయాలతో, లక్ష్య సాధనతో జిల్లాను ముందుకు తీసుకు వెళ్లాలని ఈ సందర్భంగా కలెక్టర్, జె సి అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**(వి న్యూస్, చేబ్రోలు):** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కోటి ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు మాత్రమే భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయని తెలిపారు. 2023 సంవత్సరంలో విద్యార్థులు కష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని... వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషిచేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో 2023వ సంవత్సరానికి గాను తీర్మానించిన ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీవైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యంతో పాటు పరిశోధనాత్మక ఆలోచనలు కలిగిన విద్యా విధానం ఉండాలని తెలిపారు. కార్పొరేట్ ప్రపంచంలో యువతకు విస్తృత అవకాశాలున్నాయని, వాటిని సాధించేందుకు అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌ను కట్ చేశారు. నూతన సంవత్సర వేడుక కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, లారా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్యాంకర్లు జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి -జిల్లా కలెక్టర్




**(వి న్యూస్ మచిలీపట్నం):** వివిధ ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు సకాలంలో రుణాలను మంజూరు చేస్తూ బ్యాంకర్లు జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను కోరారు.

శనివారం ఆయన స్పందన సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమీక్ష సమావేశంలో పాల్గొని ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాల మంజూరు పురోగతిపై బ్యాంకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రుణాలు లబ్దిదారులకు సకాలంలో అందే విధంగా కృషి చేయాలని, ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు రుణాలను అందిస్తూ వారి అభివృద్ధికి చేయూత నివ్వాలన్నారు. గృహ, వ్యవసాయ పంట రుణాలు, సున్నా వడ్డీ, జగనన్న తోడు, స్వయం సహాయక సంఘాలు, ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రుణాలు వెంటనే మంజూరు అయ్యేలా చూడాలన్నారు. ఆయా బ్యాంకుల వద్ద ఉండిపోయిన లబ్దిదారులు పెండింగ్ ధరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జగనన్న తోడు పథకం క్రింద రుణం పొంది 10 నెలల లోపే సక్రమంగా చెల్లించిన వారికి రెండవ దఫా 11 వేలు రుణం మంజూరు అయ్యే విధంగా చూడాలన్నారు. జగనన్న ఇళ్లు, టిడ్కో గృహాలకు రుణాల మంజూరును వేగవంతం చేయాలని, వచ్చే జనవరి 7 కల్లా ఆయా రుణాల మంజూరుకు సంబంధించిన పెండింగ్ ధరఖాస్తులను క్లియర్ చేయలన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ఐడీడీ, ఆర్ బీఐ, ఎపీ రీజనల్ ఆఫీసర్ ఆర్.కె. హనుమకుమారి, ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సుధారాణి, ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వి.వి. ఫణిరామ్ కుమార్, ఎల్డీఎం సాయిరామ్, టిడ్కో పివో బి. చిన్నోడు, ఇండస్ట్రీస్ జిఎం వెంకట్రావు, డిఆర్డీఏ పీడీ ప్రసాద్, ఇతర బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# జగన్ పాలనలో 2022 విధ్వంసాల సంవత్సరంగా మిగిలిపోయింది : చంద్రబాబు



**నెల్లూరు :** రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చిన నాటినుంచి ప్రతి ఏటా విధ్వంసాల సంవత్సరమేనని తెదేపా అధినేత చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛ కోల్పోయి శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా క్షోభ అనుభవిస్తున్నారని అన్నారు. నెల్లూరు జిల్లా రాజుపాలెంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. '2022కు వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతున్నాం. జగన్ పాలనలో 2022 విధ్వంసాల సంవత్సరంగా మిగిలిపోయింది. వైకాపా అధికారం చేపట్టిన నాటి నుంచీ ప్రతీ ఏడాదీ విధ్వంసాలే. ప్రభుత్వ విధ్వంసాల పనితనం ప్రజలు అనుభవించారు. ప్రతిపక్షంలో పలుమార్లు తెదేపా ఉన్నా ప్రజలు ఎప్పుడూ ఇంతగా ఇబ్బందిపడలేదు. అందుకే జగన్ రెడ్డిని సైకో అనేది. మీడియా సహా వివిధ వ్యవస్థలపై దాడి చేసి పైశాచిక ఆనందం పొందాడు' 'దేశంలో ఎక్కడాలేని ధరలు మన రాష్ట్రంలోనే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతీరైతు మీద అప్పుంది. రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం 3వ స్థానంలో ఉంది. కౌలురైతు వ్యవస్థలో అగ్రస్థానంలో ఏపీ ఉండేది.. ఇప్పుడు కౌలు రైతులు [illegible] పారిపోయారు. రాష్ట్రం గంజాయి హబ్‌గా మారి మహిళలకు రక్షణ లేకుండా పోయింది. గంజాయి, డ్రగ్స్ నివారణపై సీఎం శ్రద్ధ పెట్టట్లేదు. ఈ మూడున్నరేళ్లలో 53 వేల మందికి పైగా మహిళలపై అఘాయిత్యాలు జరిగాయి'' 'సంపద సృష్టించే యువశక్తి రాష్ట్రంలో నిర్వీర్యమైపోయింది. నిరుద్యోగుల్లో నిరుత్సాహం, నిస్సహాయత నెలకొంది. విద్యా వ్యవస్థను నాశనం చేశారు. ఎక్కడా లేని పన్నులు రాష్ట్రంలోనే ఉన్నాయి. ప్రజలపై 40 రకాల పన్నులు మోపారు' అని జగన్ ప్రభుత్వంపై చంద్రబాబు మండిపడ్డారు.








































Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279